క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎస్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాపువాడ, అలంకార్, కాకతీయ కాలనీ, ఉజ్జీబేస్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిలిచిన సౌండ్ లైటింగ్ షో

ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన గాలివానతో మధ్యకోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకూలింది. దాంతో రెండు రోజులుగా సౌండ్ లైటింగ్ షో నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు ఆది, సోమవారం రెండు రోజుల పాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. ఈక్రమంలో మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో టీఎస్‌టీడీసీ ఆధ్వర్యంలో కాకతీయుల విశిష్టతను వివరించే సౌండ్ లైటింగ్ షో ప్రదర్శన ఆగిపోయింది. ఈవిషయం తెలియక పర్యాటకులు సౌండ్ లైటింగ్ షోకు వచ్చి లేదని తెలిసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. విద్యుత్‌ను పునరుద్ధరిస్తే మంగళవారం నుంచి షో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల విజయ్ తెలిపారు.

బ్రాండ్ స్కూళ్ల పేరుతో మోసం

వరంగల్: ఆశ్మక, బీవీకేల పేర్లతో అనుమతులు ఉన్న పాఠశాలలను బిట్స్ ట్యాగ్ తగిలించి బిట్స్ అశ్మిక, బీవీకే స్కూళ్ల పేరుతో కార్పొరేట్ యజమాన్యాలు విద్యార్థులను మోసం చేస్తున్నాయని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్ విమర్శించారు. ఈమేరకు బ్రాండ్ స్కూళ్ల పేరుతో మభ్యపెడుతున్న కాశిబుగ్గ ప్రాంతంలో పాఠశాలలపై చర్య తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేదలకు స్థలాలు కేటాయించాలి




కాశిబుగ్గ: ఖిలా వరంగల్ మండల పరిధిలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఐద్వా జిల్లా కన్వీనర్ నలిగంటి రత్నమాల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలను సమీకరించి 35వ డివిజన్‌లోని 321, 331 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో సీపీఎం నాయకులు సోమవారం ఎర్రజెండాలు పాతారు.

చెట్లు నరికివేసిన వారిపై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ వేడుక మందిరం సమీపంలో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను నరికివేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు అటవీశాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఓ వైపు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొంతమంది షాపు యజమానులు అడ్డంగా చెట్లు ఉన్నాయని నరికివేయడం భావ్యం కాదని సూచించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా మొక్కలను నాటి పెంచాల్సిందిపోయి నరికివేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

కొనసాగిన ఎన్ఎస్ఎస్ శిబిరం



పూలకుండీల్లో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, వలంటీర్లు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో సోమవారం ప్రత్యేక శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సెరీకల్చర్ విభాగం నుంచి క్యాంటీన్ వరకు శ్రమదానం చేశారు. పరిసరాలను శుభ్రం చేసి, పద్మాక్షి మహిళా హాస్టల్ వద్ద పూలకుండీల్లో మొక్కలు నాటారు. కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ వినోద్‌రావు.. ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సందర్శించి వలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వివేక్, రత్నాకర్, ప్రదీప్, ఇమ్రాన్, సంతోషిని, చైతన్య, శివ, నరేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యా కేంద్రంలో ఉద్యోగుల శ్రమదానం

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రంలోని ఉద్యోగులు సోమవారం శ్రమదానం చేశారు. ఈనెల 25నుంచి 27వరకు న్యాక్ టీం రానున్న నేపథ్యంలో ఉద్యోగులు దూరవిద్యా కేంద్రం ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్‌రావు, డాక్టర్ ఎఫ్రిమ్‌రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించాలి



అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీకి 7, కలెక్టరేట్ డీ సెక్షన్‌కు 5, సర్వే ల్యాండ్ రికార్డ్స్‌కు 4, తహసీల్దార్ ఎల్కతుర్తికి 4, కమలాపూర్‌కు 4పాటు మొత్తం 87 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీపీఓ జగదీశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీసీఎస్‌ఓ వసంత లక్ష్మి, మార్కెటింగ్ అధికారి సురేఖ, మైనింగ్ ఏడీ నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

వేసవి సెలవులలో ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహించి, విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలు పాటించని ఏకశిల విద్యాసంస్థలపై చర్య తీసుకోని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, జగన్, భగత్, నవీన్, సిద్దు, పవన్ పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల నరేష్, గణేష్, కార్తీక్, నవీన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార మార్గాలు చూపాలి

కరీమాబాద్: ప్రజలు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి వాటికి పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. కాగా, సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొత్తం 76 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పట్నాయక్

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు వేసవి సెలవులు ప్రకటించాలి



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి

వరంగల్: వేసవిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నందున జూన్ 10వరకు మార్కెట్‌కు సెలవులు ప్రకటించాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. మార్కెట్‌లోని మిర్చి యార్డు కార్యాలయంలో రైతులు, కార్మికులు, సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ లక్ష్మీబాయిలకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, వివిధ సెక్షన్ల కమిటీ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ బీవీ.రాహుల్, డీఎంఓ పాలకుర్తి ప్రసాద్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరంచంద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితుడి ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: అకాల వర్షాల కారణంగా వరంగల్ 36వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పేదల ప్రజల ఇళ్లకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, ఈక్రమంలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీవుల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. చింతల్‌లో నివాసం ఉంటున్న తెలంగాణ ఉద్యమకారుడు చాంద్‌పాషా ఇంటిని సోమవారం పరిశీలించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాలివాన బీభత్సంతో పేదలకు లక్షలాది రూపాయల నష్టం జరిగిందని వివరించారు. దాంతో వారికి నిలువనీడ లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో మోహిష్‌బాబా, ఖాదర్ అలీబాబా, ఇమ్రాన్, అఖిల్ తదితరులు ఉన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 27వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు చింతాకుల సునీల్‌కుమార్, టి.రమేష్‌బాబు, జారతి రమేష్, పరమేశ్వర్, అజయ్, యాకుబ్ శరత్, శ్రీధర్, రాజు, శైలజ, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

డీన్ అమరవేణికి అభినందనలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల డీన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణిని యూనివర్సిటీ పీజీ కళాశాలలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సోమవారం కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

మడికొండ: రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ధర్మసాగర్, వేలేరు, మండలాలకు చెందిన పీఏసీఎస్, ఐకేపీలకు చెందిన ఇన్‌చార్జ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ఎక్కువ మొత్తంలో తరుగు తీయకూడదని హెచ్చరించారు. ఆరుగాలం కష్టపడిన రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ రమేష్, మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు నర్సింగరావు, దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సహస్ర అలంకరణలో మల్లన్న



కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం సహస్ర పుష్పాభిషేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పండితులు రుద్రాభిషేకంతో పాటు పుష్పాలంకరణ పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పండితుడు రేపాక శ్రీనివాస్‌శర్మతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై చర్య తీసుకోండి



నిరసన తెలుపుతున్న షాపింగ్ కాంప్లెక్స్ ఓనర్లు

వరంగల్ అర్బన్: విక్టరీ షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేసి, కనీస వసతులు కల్పించాలని ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఓనర్లు సోమవారం నిరసన తెలిపారు. బాత్ రూంలు, టాయిలెట్లు నిర్మించాల్సిన స్థానంలో షట్టర్లు నిర్మించి కిరాయికి ఇస్తున్నారని తెలిపారు. హనుమకొండలో ఇటీవల ప్రారంభించిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ భవన నిర్మాణ నిబంధనలు 2012 ప్రకారం, బిల్ట్ అప్ ఏరియాలో 50% పార్కింగ్ కోసం కేటాయించ లేదని, ఈమేరకు చర్య తీసుకోవాలని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

వరంగల్ క్రైం: పెళ్లైన 9రోజులకే ఓ వివాహిత.. తను ప్రేమించిన వ్యక్తితో కలిసి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నాకి పాల్పడి మృతిచెందిన సంఘటన భీమదేవరపల్లి మండలం గొల్లపల్లిలో జరిగింది. గొల్లపల్లికి చెందిన సంగ మానస (20)కు హుస్నాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన అంజితో ఈనెల 11న వివాహం జరిగింది. 18న తల్లిగారి ఇంటికి వచ్చి హనుమకొండకు చెందిన తను ప్రేమించిన విజయ్‌తో కలిసి క్రిమిసంహారక మందు తాగి 19న ఆత్మహత్యాయత్నానికి ఇరువురు పాల్పడ్డారు. ఈమేరకు ఎంజీఎంలో చికిత్స పొందుతూ మానస సోమవారం మృతిచెందింది. కాగా, విజయ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితురాలి తండ్రి సంగ లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు.

గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలి



ధర్నా చేస్తున్న గొల్ల కురుమలు

కరీమాబాద్: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా గొల్లకురుమలకు వెంటనే నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 575 మంది ఎనిమిది నెలల క్రితం తమ వాటాగా రూ.43,750 చొప్పున అప్పులు తెచ్చి డీడీలు తీశారని గుర్తుచేశారు. గొర్రెలు ఎప్పుడిస్తారో చెప్పకుండా డీడీలు తీయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర బోయిన సారంగం, చల్ల మల్లయ్య, లింగస్వామి, మల్లేష్, రాజ్‌కుమార్, రవి, శ్రీను, వెంకటేశ్వర్లు, రాజు, వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో ఓ యువకుడిపై దాడి జరిగింది. పెద్ద మనుషుల సమక్షంలోనే ఈ ఘటన జరగగా వంగపహాడ్‌కు చెందిన ముస్కు సాయిరాంకు బలమైన గాయలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వంగపహాడ్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, ముస్కు సాయిరాం బంధువులు. అయితే, ఆదివారం ఓ కార్యక్రమం సందర్భంగా వారిరువురి మధ్య గొడవ జరిగింది. సాయిరాం తనపై దాడి చేశాడని పెద్ద మనుషులకు ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. కాగా, సోమవారం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్, సాయిరాంలు మళ్లీ గొడవకు దిగారు. ఈ సంఘటనలో సాయిరాంపై ప్రేమ్‌కుమార్ అతని అనుచరులు దాడి చేశారు. ఈ దాడిలో సాయిరాం తలతో పాటు చేయి, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ప్రేమ్‌కుమార్, అతని అనుచరులు మద్యం తాగి తనపై కత్తులు, రాళ్లతో దాడి చేశారని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో సాయిరాం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



కరీమాబాద్: మాట్లాడుతున్న రైస్‌మిల్లర్లు

కరీమాబాద్: ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, బాధ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్ ప్రావీణ్యను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవడంతో ఇబ్బందులు ఎదువుతున్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం క్వింటాకు రారైస్ 67 కిలోలు, బాయిల్డ్ రైస్ 68కిలోలు రావాల్సి ఉండగా 60 నుంచి 65కిలోల వరకు వస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవునూరి అంజయ్య, యుగంధర్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: మధ్యకోటలో 31వ సర్వే నంబర్‌లోని 1.8 గుంటల విస్తీర్ణంలోని శృంగారపు బావి చుట్టుపక్కల భూముల కొనుగోలులో భాగస్వాములైన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు బైరబోయిన శివాజీ కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపేట – హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం 70ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉండగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలకు 98663 30257, 94932 01968 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్, మేయర్‌ను కలిసిన కమిషనర్ రిజ్వాన్ బాషా



హనుమకొండ కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్



మేయర్ సుధారాణితో భేటీ అయిన కమిషనర్ రిజ్వాన్



జిల్లా జడ్జి కృష్ణమూర్తికి మొక్క అందిస్తున్న కమిషనర్

హన్మకొండ అర్బన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా.. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

మేయర్, జడ్జిని కలిసిన కమిషనర్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణిని కమిషనర్ రిజ్వాన్ బాషా బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్క అందజేయగా, మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టబోయే, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. అనంతరం పరిపాలన భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం, హనుమకొండలోని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎం.కృష్ణమూర్తిని కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

31న బ్రాహ్మణుల 'చలో హైదరాబాద్'



మాట్లాడుతున్న సేవా సమితి ప్రతినిధులు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో ఆరు ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమితి వరంగల్ త్రినగరి అధ్యక్షుడు పెండెం రాఘవరావు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని బ్రాహ్మణసేవా సమితి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీ మేరకు బ్రాహ్మణుల కోసం భవనం నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాలరావు, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, రాజ్‌కుమార్, శ్రీనివాసచారి, పరశురాం, వెంకటరమణాచారి, నాగరాజు, రవీందర్, కలకుంట్ల మేఘశ్యాం, శ్రీమన్నారాయణ, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

ఆజంజాహి భూముల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నయీంనగర్: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ప్లాట్ల కేటాయింపును రద్దు చేయాలని, ఎంవీఆర్ఎస్ కార్మికులకు ఆజంజాహి మిల్లు భూముల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆల్‌ట్రేడ్ యూనియన్ సీఐటీయూ, ఐకేటీయూ, బీఎంఎస్ నాయకులు ఇనుముల శ్రీనివాస్, నాగపురి వెంకటేశ్వర్లు, గంగుల దయాకర్, మచ్చ రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మడిపల్లిలోని ప్లాట్లను కేటాయిస్తున్నామనే పేరుతో మే 20వ తేదీన అంబేడ్కర్ భవన్‌లో డ్రా పద్ధతిలో కుడా అధికారులు, కలెక్టర్.. సుప్రీంకోర్టుకు తప్పుడు నివేదిక సమర్పించారని తెలిపారు. వారు అనుసరిస్తున్న విధానాలను ఆల్‌ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

ట్రిపుల్‌ఆర్ సెంటర్ ప్రారంభం

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటలో ట్రిపుల్‌ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) సెంటర్‌ను కార్పొరేటర్ మామిండ్ల రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్దియా ఆధ్వర్యంలో నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు ఇంట్లో నిలువఉన్న పనికిరాని వస్తువులు, ఇతర సామగ్రిని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ ఇంద్రసేన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతోనే మనుగడ

రామన్నపేట: జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ కొనసాగుతుందని ప్రముఖ పర్యావరణవేత ప్రొఫెసర్ ఠాగూర్ రతన్‌సింగ్ తెలిపారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీవ వైవిధ్యంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ రతన్‌సింగ్ మాట్లాడుతూ మానవ జీవన శైలితో పర్యావరణం కాలుష్యమై ప్లాస్టిక్ వినియోగం, చెట్లు నరకడం అధిక ఉష్ణోగ్రతలపై నియంత్రణ లేకపోవడం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు అధికంగా వాడటం ద్వారా భూగోళం వేడెక్కి జీవరాశులకు పెద్ద ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.భుజేందర్‌రెడ్డి, సంజీవ, అనిత, పర్యావరణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో పరిపాలన భవనం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, జనరల్ సెక్రటరీ ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు వెంకటేశ్వర్లు, మధుకర్‌రావు, సంగీత్‌కుమార్, శ్రీధర్, బ్లెస్సీ, ప్రియాంక, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన నాయకులు

వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను బీఆర్ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వేముల నవీన్, 3వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, 14 డివిజన్ ప్రధాన కార్యదర్శి పత్రి సుభాష్, పైడిపల్లి సొసైటీ డైరెక్టర్ నాగవరపు సుధాకర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్, మేకప్‌లో ఉచిత శిక్షణ

నయీంనగర్: వరల్డ్ ఆఫ్ బ్యూటీషియన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఫ్యాషన్ డిజైనింగ్, మేకప్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాజియా ఉజ్మా తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 30న బ్యూటీషిన్లు, మేకప్ ఆర్టిస్టులకు లుక్ అండ్ లర్న్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)